కథ

# గోవర్ధనం-గోధుమ హల్వా

ప్రతాప రవిశంకర్

గోవర్ధనం గుడి దగ్గరకు వచ్చేసరికి గుడి ముందున్న అరుగు ఖాళీగా వుంది. నాలుగు కిలోమీటర్లు నడిచి వచ్చేసరికి అతను బాగా అలిసిపోయాడు. బస్సును సమయానికి అందుకోవాలనే తొందరలో అతడు కొంచెం వేగంగా నడిచాడు. ఆ గతుకుల మట్టి రోడ్డు మీద.


అందువల్ల గుడి ముందున్న అరుగును చూడగానే వెళ్లి దాని మీద కూర్చున్నాడు. చేతిలో వున్న చిన్న జిప్ బ్యాగ్‌ను పక్కన పెట్టి అతను ఎక్కవలసిన బస్సు ఆ గుడిముందుకే వచ్చి ఆగుతుందని చెప్పాడు మురళీకృష్ణ-గోవర్ధనం స్నేహితుడు.

ఆ మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో వున్న చిన్న పల్లెటూరిలో వుంటున్న స్నేహితుడు మురళీకృష్ణను చూడడానికి క్రితం రోజు ఉదయం రాజమండ్రి నుంచి ఆ వూరికి వచ్చాడు గోవర్ధనం. తిరిగి వెళుతూ అక్కడకు వచ్చి ఆ అరుగు మీద కూర్చున్నాడు.

ఎండ క్రమంగా బలహీనపడుతోంది. సాయంత్రం ఐదు గంటలు కావస్తున్నదప్పుడు ఎండ అతనిమీద పడకుండా గుడి పక్కనే వున్న రావి చెట్టు నీడ అతను కూర్చున్న అరుగు మీద పడుతోంది.

బస్సు రావడానికి ఇంకో పదినిమిషాలు టైం వున్నదనుకున్నాడు వాచీ చూసుకుని.

గుడి ఎదురుగా రోడ్డుకు అవతల చిన్న పెంకుటిల్లు వుంది. ఆ ఇంటి పంచ ముందుకు వాలి వుంది. అందులో ఓ పక్కగా నులకమంచం వాల్చి వుంది. ఆ మంచం మీద ఓ వృద్ధ స్త్రీ కూర్చుని పత్తితో దీపారాధన చేసే వత్తులను చేస్తోంది.



గోవర్ధనంకు ఆమెను చూడగానే గబుక్కున తన తల్లి గుర్తుకు వచ్చింది. దాదాపుగా అదే వయసులో వుంది. తన తల్లికి చెల్లెలనో, అక్కయ్యనో అంటే ఎవరయినా సులభంగా నమ్ముతారు.

ఆమెనే ఇంకొంచెం పరీక్షగా చూశాడు. ఆమె తన పనిలో లీనమై వుంది. ఇంట్లో ఆమె తప్పించి ఇంకెవరూ వున్న జాడలు కనిపించలేదు.

గోవర్ధనానికి తల్లి గుర్తుకు రావడంతో గోధుమ హల్వా కూడా గుర్తుకు వచ్చి మనసు అంతా అదోలా అయిపోయింది.

ఎందుకంటే గోవర్ధనానికి చిన్నతనంలో అతడి తల్లి సాయంత్రం వేళ అతను స్కూలు నుంచి వచ్చేసరికి గోధుమ హల్వా చేసి వుంచి అతడు రాగానే దగ్గర కూర్చుని తినిపించేది. అతను ఎంతో ఇష్టంగా తినేవాడు.

అతడికి గోధుమ హల్వా అంటే ఇష్టమని గ్రహించిన ఆ తల్లి ఈ అలవాటును చాలా రోజులు కొనసాగించింది. అతను కాలేజీలో చదువుతున్నప్పుడు కూడా ప్రత్యేకించి అతనికోసమే గోధుమ హల్వాను చేసేది.

ఆమెను చూస్తూ వుంటే గోవర్ధనానికి ఆ రోజులు గుర్తుకువచ్చాయి. తన తమ్ముడు చెల్లెళ్లు తన కంటే వాళ్లకు హల్వా తక్కువ

పెట్టిందని తల్లితో గొడవ పడేవాళ్లు. అయినా ఆమె తనకే ఎక్కువ పెట్టేది.

ఉదయం ఎప్పుడో భోజనం చెయ్యడం వల్లనూ, నాలుగు కిలోమీటర్లు నడిచినందు వల్లనూ గోవర్ధనానికి ఆకలిగా వుంది. ఆ గుడికి దగ్గరలోనే ఓ చిన్నపాటి హోటలు వుంది. కావాలనుకుంటే వెళ్లి ఏదో ఒకటి తిని రావచ్చు.

కానీ–గోవర్ధనానికి గోధుమ హల్వా తినాలనే కోరిక బలంగా కలిగింది.

ఎదురింట్లో వున్న ముసలామె మంచం మీద నుంచి లేచి ఇంట్లోకి వెళ్లి ఓ ఐదు నిమిషాలకు తిరిగి వచ్చి మంచం మీద కూర్చుంది. ఈసారి ఆమె వొడిలో చేట వుంది. అందులో వున్న ధాన్యంలో మట్టి బెడ్డలను ఏరుతోంది.

ఇంట్లో ఇంకెవరూ కనపడనందున ఆమెకు ఎవరూ లేరేమో అనుకున్నాడు గోవర్ధనం. కొడుకో, కూతురో వుండి వాళ్లు బయటకు వెళ్లి వుండవచ్చని అనుకున్నాడు మళ్లీ.

సరిగ్గా అతనలా అనుకున్నప్పుడే రోడ్డు మీద ఏదో మోటారు వాహనం వస్తున్న కూత వినిపించింది. తీరా చూస్తే అది బస్సు కాదు. లోడుతో వచ్చిన లారీ దుమ్ము రేపుకుంటూ అతని ముందు నుంచి వెళ్లిపోయింది.

ఆ ముసలామె విధవ అయినా రంగు చీర కట్టుకుంది. పూర్తిగా నెరిసిన జుట్టును తన తల్లిలాగే ముడిపెట్టుకుంది. హఠాత్తుగా అతడికి తల్లి ముఖం కళ్ల ముందు అస్పష్టంగా కదలాడింది. ఇప్పుడామె ఎలా వుందో? అనుకున్నాడతను. అతడు తల్లిని చూసి చాలా రోజులయ్యింది. రోజులు కాదు కొన్ని సంవత్సరాలయ్యింది.

గోవర్ధనం పెళ్లయిన తర్వాత కొన్ని రోజులు అతడి తల్లి గోవర్ధనం దగ్గరే వుంది. తర్వాత గోవర్ధనం భార్య శారదకి అత్తగారు తమ దగ్గిర వుండడం నచ్చలేదు. ఆమె నుంచి ఆస్తి ఏమీ రానప్పుడు ఆమెని జీవితాంతం పోషించవలసిన అవసరం ఏముందని అనుకుంది శారద. తన అభిప్రాయాన్ని గోవర్ధనంతో చెప్పినప్పుడు అతడికి కూడా భార్య అభిప్రాయం నిజమేననిపించింది. ఒక రోజు కావాలని ఆమెతో వాదన పెట్టుకుని–

''నువ్వు మాకేం ఇచ్చావ్?'' అని అడిగాడు తల్లిని. ఆమె బదులు చెప్పలేకపోయింది. తన పెంపకంలో పెరిగిన కొడుకు అలా అడుగుతాడని ఆమె వూహించలేదు. నిజానికి గోవర్ధనం తండ్రి ఓ పల్లెటూళ్లో వీధి బడి నడిపేవాడు. దాని మీద వచ్చే ఆదాయం కుటుంబ పోషణకే సరిపోయేది కాదు. ఈ విషయం స్పష్టంగా తెలిసి కూడా కొడుకు అలా అడిగినందున పరోక్షంగా గోవర్ధనం తనని ఇల్లు విడిచి వెళ్లమంటున్నాడని అర్థం చేసుకుంది ఆమె.

ఈ విషయాన్ని పెద్ద కూతురికి చెప్పినప్పుడు పెద్దకూతురు శ్యామల తల్లిని తనతో ఇంటికి తీసుకెళ్లింది. తన అంగీకారం లేకుండా అత్తగారిని తన ఇంటికి తీసుకువచ్చినా అల్లుడు అహోబలరావు ఏమీ అనలేదు భార్యను. ఎందుకంటే ఆ ఇంట్లో ఓ నమ్మకమైన పనిమనిషి అవసరం ఎంతయినా వున్నదని.


ఆ ఇంట్లో చాకిరీతో గోవర్ధనం తల్లి సగం అయ్యింది. ఆరోగ్యం బాగా పాడయ్యింది. అయినా వాళ్లు ఆమెను డాక్టరుకు చూపించి మందులు వాడలేదు. ఆ సమయంలోనే అక్కయ్య ఇంట్లో ఏదో ఫంక్షన్ వుండి గోవర్ధనం ఆ ఇంటికి వచ్చాడు. తన పరిస్థితి గురించి కొడుకుతో చెప్పుకుంది తల్లి. అయినా అతడు మనో నిగ్రహంతో ప్రత్యేక శిక్షణ పొందినవాడిలా కొంచెం కూడా చలించలేదు. పైగా సంతోషించాడు మనసులో...

చివరగా...

''తిండి పెడుతున్నారుగా...సంతోషించు... ఈ రోజుల్లో అత్తగారికి తిండిపెట్టే అల్లుడెవడున్నాడు?'' అని పెద్దగా నవ్వాడు.

అలాంటి కొడుకు ఎదుట ఏడ్వడం కూడా అనవసరమని వస్తున్న కన్నీటిని ఆపుకుని–

''నిజమే... అహోబలం ఎంతో మంచివాడు. పని మనిషి హోదాలో అత్తగారికి తిండిపెట్టి బతికిస్తున్నాడు'' అన్నది.



అంతే – అదే చివరిచూపు... ఆ తర్వాత గోవర్ధనం తల్లిని చూడలేదు.

తర్వాత అతనికి తెలిసింది. గోవర్ధనం బాబాయి కొడుకు కృష్ణమూర్తి తన తల్లిని తీసుకెళ్లి విజయవాడలో తన ఇంట్లో వుంచుకొని ఆమెని పోషిస్తున్నాడని. అయినా అతనికి ఏమీ అనిపించలేదు.

మొదటి నుంచీ గోవర్ధనానికి ఓర్వలేని గుణమని ఒకటి వుండేది. అతనితో పాటుగా అది కూడా పెరుగుతూ వచ్చింది. తనకంటే ఎదుటివాళ్లు కొంచెం మంచిగా వుంటే అతను సహించగలిగేవాడు కాదు. తనకు లేనివి ఎదుటివాళ్లలో వున్నాయని, తను అనుభవించలేని సుఖాలూ, భోగాలూ ఎదుటివాళ్లు అనుభవిస్తున్నారనీ, ఈనాటి తన దుస్థితికి తల్లిదండ్రులే కారణమనీ అతను తల్లితండ్రుల మీద ద్వేషం పెంచుకున్నాడు. తండ్రి చనిపోయిన తర్వాత ఆయన వంతు ద్వేషాన్ని కూడా తల్ల మీదకు ట్రాన్స్‌ఫర్ చేశాడు.

గోవర్ధనానికి డబ్బు మీద, డబ్బు వల్ల వచ్చే సుఖాల మీద విలాసాల మీద అంతులేని వ్యామోహం వుండేది. కాలేజీ చదువుతో ఆపేసిన అతనికి అతను వూహించినట్టుగా గొప్ప ఉద్యోగం ఏదీ రాలేదు. నిజానికి పోటీలో నెగ్గి ఉద్యోగం తెచ్చుకునే టంతటి తెలివితేటలూ అతనికి లేవు. ఆ విషయం అతనికీ తెలుసు. అయినా నమ్మడు. చివరకు ఓ ప్రైవేటు సంస్థలో తక్కువ స్థాయి ఉద్యోగాన్ని ఎవరి దయవల్లో పొంది జీవితంలో స్థిరపడిపోయానని అందరినీ నమ్మించాడు. అతడి సంపాదన అతడి కుటుంబానికే సరిపోయేది కాదు. అయినా గోవర్ధనానికి ఓ బలమైన నమ్మకం వుండేది. అదేమిటంటే–

ఎప్పుడో, ఏదో ఊహించని గొప్ప సంఘటన జరుగుతుందనీ, ఆ సంఘటనతో తన జీవితం మారిపోతుందనీ, తను కోరుకున్నవన్నీ తనకు దక్కుతాయనీ–


తరచుగా ఇలా అనిపిస్తూ వుండేది. ఇప్పటికీ అదే ఆలోచన అతడిలో వుంది. కానీ ఇంతవరకూ అతను అనుకున్న సంఘటన జరగలేదు. ఒక గుడ్డి నమ్మకంతో, భవిష్యత్తు మీద ఆశతో బతుకుతున్నాడు గోవర్ధనం.

రాజమండ్రిలో గోవర్ధనం వుంటున్న ఇంటి పక్క పోర్షన్‌లో శ్రావణరావు అనే అతను వుండేవాడు. అతడికి తండ్రి లేడు. తల్లి అతని దగ్గరే వుండేది. అతను తల్లిని బాగా ప్రేమగా చూసుకునేవాడు. శ్రావణరావు ఏదో ప్రభుత్వ కార్యాలయంలో టైపిస్టుగా చేసేవాడు. అతను దగ్గరుండి భార్యచేత తల్లికి సేవలు చేయించేవాడు. తల్లిచేత ఏ పనీ చేయించేవాడు కాదు. ఎప్పుడైనా భార్య పుట్టింటికి వెళ్లినప్పుడు ఇంటి పనంతా తనే చేసేవాడు. చివరకు తల్లి బట్టలను కూడా తనే ఉతికి ఆరేసేవాడు. ఇదంతా చూసి ఒకరోజు గోవర్ధనం శ్రావణరావుని ఇలా అడిగాడు.

''మీ అమ్మకు కొంచెం ఓపిక వున్నది కదా... ఆమె బట్టలు నువ్వు ఉతకడం ఎందుకు? ఆమె చేసుకోగలదు కదా?''

అప్పుడు శ్రావణరావు నవ్వి ఇలా చెప్పాడు.

''నువ్వు అమాయకుడివిలా వున్నావు. నీ ఉద్దేశం నాకు అర్థమయింది. ఆడవాళ్ల బట్టలు మగవాళ్లు ఉతకడం ఏమిటనే కదా? పిల్లల్ని కని పెంచడంలో తల్లికి లేని ఆడ, మగ భేదం మనకు ఎందుకు? తల్లికి సేవ చేసే అవకాశం వున్నందుకు మనం సంతోషించాలి... ఇదొక గొప్ప వరం అనుకో.... ఎందుకంటే ఎన్ని జన్మలెత్తినా తల్లి రుణం తీర్చుకోలేము. చిన్నతనంలో మనకు కేవలం ఏడవడం తప్ప మరేమీ తెలీని వయసులో మన అవసరాలు గ్రహించి మన వల్ల ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని మనల్ని పెంచి, పెద్దవాళ్లను చేస్తుంది తల్లి. ఈ రోజు సమాజంలో నువ్వు, నేను ఇంత వాళ్లమయ్యి మనుషులుగా ఒక గుర్తింపు పొందడానికి కారణం ఎవరు? మనం ఎవరివల్ల ఈ లోకంలోకి వచ్చాం? ఆలోచించు. ఆడదానికి భర్త, పిల్లలకు తల్లిదండ్రులు దైవంతో సమానం అంత దూరమెందుకు? నీకు వినాయక చవితి కథ తెలుసు కదా! అందులో వినాయకుడికి గణాధిపత్యం ఎలా దొరికింది? ఆయన తల్లిదండ్రులకు కేవలం మూడు సార్లు ప్రదక్షిణం చేసినందువల్ల ఎన్నో నదుల్లో స్నానమాచరించిన పుణ్యం లభించి ఆయన గణాధిపతి అయినాడు. ఇప్పటికయినా ఏ దేవుడయినా రథం మీద ఊరేగుతూ వస్తున్నప్పుడు జనం ఆ రథం తాళ్లు




పట్టుకు లాగడానికెందుకు పరుగులు దీస్తారు? అలా చేస్తే పుణ్యం వస్తుందని. కానీ నా దృష్టిలో అది గొప్ప కాదు. తల్లిదండ్రుల సేవచెయ్యడమే నిజమైన పుణ్యం. ఇప్పటికీ మా అమ్మకు రోజూ రాత్రి పడుకున్నప్పుడు కాళ్ల పడతాను. నాకు అదో మహద్భాగ్యం. పాపపుణ్యాల గురించి తరువాత ఆలోచించు. కేవలం మానవతా దృక్పథంతో ఆలోచిద్దాం.''

"మన జేబులో నుంచి పెన్ను కిందపడినప్పుడు దాన్ని ఎవరయినా తీసి మనకిచ్చినప్పుడు మనం థ్యాంక్స్ చెబుతాం.అలాంటిది మనల్ని కని పెంచి ఇంత వాళ్లను చేసిన మన తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత చూపించకపోవడమనేది భావ్యమేనా? కృతజ్ఞత చూపించడమంటే ఏమిటో కాదు. పెద్దతనంలో వాళ్ల కనీస అవసరాలు తీర్చడం. వాళ్లచేత ఇంటి చాకిరీ చేయించకుండా వాళ్ల పట్ల గౌరవం, ప్రేమ చూపించడం. ఇవి చాలు. ఇంతకు మించి వాళ్లు కూడా ఏం కోరుకోరు. వాళ్లు మనకు భోగభాగ్యాలను ఇవ్వలేదని అనుకోవడం కూడా చాలా తప్పు. వాళ్లకే లేనప్పుడు ఇంక మనకు ఇవ్వడం అనే ప్రసక్తి వుండదు. రేపు నువ్వు, నేను మన పిల్లలకు ఏమిస్తాం? వాళ్లూ మనలాగే ఆలోచిస్తే మన పరిస్థితి ఏమిటి? మనుషుల మధ్య ప్రేమ, బంధం వుండాలి గానీ ఆర్థిక బంధం వుండకూడదు. నువ్వు ఏరోజు వీటి గురించి ఆలోచించలేదనుకుంటే ఒకసారి తీరిగ్గా ఆలోచించు. ప్రపంచంలో ఏమగాడయినా భార్యపోతే మరో భార్యను తెచ్చుకోగలడు కానీ తల్లిపోతే మరో తల్లిని తెచ్చుకోలేడు. పెద్దవాళ్ల విలువ తెలుసుకో.''

గోవర్ధనానికి ఆ అరుగు మీద కూర్చుని ఆలోచిస్తున్నప్పుడు జరిగిపోయిన సంఘటనలన్నీ ఇటీవల జరిగినట్టుగా అనిపించాయి. చివరగా శ్రావణరావు తల్లి గురించి చెప్పిన మాటలు అతడిని కొంచెం కదిలించాయి. అతనికి అంతా వుండి తను ఒంటరి వాడయిన విషయం అర్థమయ్యింది. ఇందుకు కొంత వరకు తన భార్య శారద కారణమని అతనికి అనిపించింది.

ఎందుకంటే భర్తవైపు వాళ్లు తమ పరిధిలోకి రారని, తన వైపు వాళ్లే తమ కుటుంబ పరిధిలోకి వస్తారని అతడికి చెప్పింది శారద.అందువల్లనే అతడు అక్కయ్య, చెల్లెలు ఇళ్లకు రాకపోకలు నిలుపుచేశాడు. వాళ్లు కూడా అతని ఇంటికి రారు. అతడి పిల్లలకు బామ్మా, మేనత్తలు తెలీదు. స్కూలుకు సెలవులు వచ్చినా మిగిలిన పిల్లలు బంధువుల ఇళ్లకు వెళుతుంటే గోవర్ధనం పిల్లలు ఇంట్లోనే వుండేవాళ్లు. ఒక రోజు గోవర్ధనం పెద్ద కొడుకు తండ్రిని అడిగాడు.

"నాన్నా.. మనింటికి ఎవరు రారు..మనం ఎవరింటికీ వెళ్లము. ఎందుకు మనకు ఎవ్వరూ లేరా?''

ఆ ప్రశ్నకు జవాబు చెప్పలేక దిక్కులు చూశాడు గోవర్ధనం.

తమ ఈ స్థితికి కారణం ఎవరు? అనే సందేహం గోవర్ధానానికి కలిగింది. తను, తన స్వార్థం. కుంచించుకుపోయిన తన పరిధి. తన పరిధిలో తను, తన భార్యా పిల్లలు మాత్రమే మిగిలారు. చివరకు పిల్లల సహజమైన సరదాను కూడా తనే అణగదొక్కాడు. గోవర్ధనానికి గతం గుర్తుకురాగా మనసంతా బరువయింది. అతడి కడుపులో ఆకలి, గోధుమ హల్వా తినాలనే కోరిక ఎక్కువయినాయి. బస్సు మాత్రం రాలేదు.

ఉన్నట్టుండి బ్యాగును భుజానికి తగిలించుకొని గోవర్ధనం లేచి ఎదురుగా వున్న ఆ ఇంటికేసి నడిచాడు. అప్పటి వరకూ గుడి అరుగుమీద కూర్చున్న అతడిని గుర్తించి "ఏం కావాలి నాయనా?'' అని అడిగింది ఆ ముసాలమె.

''మంచినీళ్లు'' అన్నాడు గోవర్ధనం.

ఆమె లేచి లోపలకి వెళుతూ " ఆ మంచం మీద కూర్చో'' అన్నది. గోవర్ధనం కూర్చున్నాడు.

కొంచెం సేపటికి ఆమె స్టీలు చెంబుతో మంచినీళ్లు తీసుకువచ్చి అతనికి ఇచ్చింది.

అతను నీళ్లు తాగి చెంబును ఆమెకు ఇస్తూ "అమ్మా... నీకెవ్వరూ లేరా?'' అనడిగాడు.

"కొడుకున్నాడు నాయనా'' చెప్పింది.

"కోడలూ, పిల్లలూ ఊరెళ్లరా?'' మళ్లీ అడిగాడు.

"వాడు పెళ్లే చేసుకోలేదు'' నవ్వుతూ చెప్పిందా.

"చిన్నవాడా'' సందేహంగా అడిగాడు.

"కాదు నీ అంత వయసుంటుంది. పెళ్లి చేసుకుంటే వాడికి వచ్చే భార్య నన్ను సరిగా చూసుకోదేమోనన్న భయంతో అసలు పెళ్లి చేసుకోవడమే మానేసి బ్రహ్మచారిగా వుండిపోయాడు. ఇంకో గంటలో వస్తాడు నాయనా... ఇక్కడే పత్తి మిల్లులో నౌకరీ'' అన్నది.

తర్వాత స్టీలు చెంబు లోపల పెట్టి వచ్చి–

"ఏ వూరు వెళ్లాలి?'' అనడిగింది అతన్ని.

చెప్పాడు గోవర్ధనం. చెప్పి–

"అమ్మా.. నిన్నొక విషయం అడగాలి'' అన్నాడు కొంచె సంశయిస్తూ...

"ఏమిటి నాయనా? అడుగు''

"నీకు గోధుమ హల్వా చెయ్యడం వచ్చునా?'' అని అడిగాడు.

"వచ్చు నాయనా... ఎందుకు?'' కొంచెం ఆశ్చర్యంగా అడిగింది.

"చిన్నతనంలో ఎప్పుడో తిన్నానమ్మా. మా అమ్మ చేసి పెట్టేది... ఇప్పుడు తినాలని వుంది. బాగా ఆకలిగా కూడా అవుతోంది. డబ్బులిస్తాను. కావసినవి తీసుకువచ్చి నాకు గోధుమహల్వా చేసి పెడతావా?'' అని అడిగాడు జేబులో చెయ్యిపెడుతూ...

"అన్నీ ఇంట్లోనే వున్నాయి నాయనా... ఈ మాత్రం దానికి నీ దగ్గర డబ్బులు తీసుకుంటానా? నువ్విక్కడే కూర్చో...క్షణంలో చేసి తీసుకువస్తాను.'' అని లోపలకు వెళ్లిందామె.

గోవర్ధనం ఆలోచనలో పడ్డాడు.

తన పెళ్లయిన కొత్తలో ఎప్పుడయినా తన అక్కయ్యగాని, చెల్లెలు గాని తన ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్నప్పుడు తన భార్య చేత వాళ్ల మొహాన బొట్టు పెట్టించి వాళ్లకో జాకెట్టు ముక్క పెట్టడానికి తను అవసరమైన ఖర్చు అని వాళ్లను వట్టి చేతులతో పంపాడు. గాజులు వేయించుకోమని కనీసం పది రూపాయలు కూడా ఇవ్వలేదు. కానీ తనతో ఎలాంటి సంబంధం లేకుండా తనెవరో తెలియని ఈమె తన దగ్గర డబ్బు తీసుకోకుండా తనకు గోధుమ హల్వా చేసి పెట్టడానికి సిద్ధపడింది.

ఎలా సాధ్యం??

గోవర్ధనానికి తన లోపలి స్వరూపం ఏమిటో బయటకే సాక్షాత్కరించినట్లనిపించింది. అతడిని కమ్మివేసిన కుటిల స్వార్థపు పొరలు కరిగిపోతున్నట్లు ఫీలయ్యాడు. ఒక్కసారి తెరుచుకొని తిరిగి వెంటనే మూసుకుపోయే ద్వారంలా–

తనలో నిజంగా మార్పు వస్తోందా? అది ఎప్పటికీ నిలిచివుంటుందా? లేక తను తాత్కాలికంగా భావోద్వేగానికి లోనయ్యాడా? అనే సందేహం అతడిని ఆవరించింది.

ఎటూ తేల్చుకోలేకపోయాడు.

అతడి మనసు ఇలా ఊగిలాడుతున్నప్పుడు ఆ ముసలామె ఓ గిన్నె నిండా గోధుమ హల్వాతో వచ్చి మంచం మీద అతడి పక్కన కూర్చుంది. ఆ గిన్నెలో ఓ స్టీలు చెంచా వున్నది.

"నాయనా... నీ పేరేమిటో గానీ... మా అబ్బాయి సుందరానికి కూడా నేను చేసి పెట్టే గోధుమ హల్వా అంటే బాగా ఇష్టం. వాడు ఏ పండగొచ్చినా పిండి వంటకు బదులు గోధుమ హల్వానే చేయించుకు తింటాడు. నీకు ఇదంటే నే ఇష్టమా? తిను నాయనా... నువ్వూ నాకు నా సుందరం లాంటి వాడివే.. ఇంద'' అంటూ ఆమె స్పూన్‌తో గిన్నెలో గోధుమ హల్వా తీసి గోవర్ధనం నోట్లో పెట్టింది.

అప్పుడు గోవర్ధనం పెద్దగా ఏడ్డాడు.

"ఏమిటి నాయనా? ఏమయ్యింది??'' కంగారుగా అడిగింది వృద్ధ స్త్రీ మూర్తి.

"మా అమ్మ గుర్తొచ్చింది'' అంటూ బావురుమన్నాడు గోవర్ధనం.

★